క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ పద్మావతి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కుర్రా మల్లిఖార్జునరావు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ పద్మావతి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

లింగపాలెం: అన్నపనేనివారిగూడెంలో మాజీ సీఎం దివంగత నందమూరి తారక రామారావు విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన దాత బొల్లినేని సత్యన్నారాయణ, శైలజ దంపతులు సుమారు రూ.10 లక్షల ఖర్చుతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత తదితరులు పాల్గొన్నారు.

జన్మాష్టమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కృష్ణయ్య వేషధారణ పోటీలు నిర్వహించారు. రెండు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు వెండి ప్రతిమలు బహుమతులుగా అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. పరిషత్ సభ్యులు కొంచాడ దుర్గాప్రసాద్ కొన కళ్ళ వెంకటేశ్వరరావు డి.నారాయణమూర్తి, తోట రామకృష్ణ, అప్పన ప్రసాద్ పాల్గొన్నారు

పాపన్న గౌడ్ జయంతి



మాట్లాడుతున్న దాసరి శ్యామ్‌చంద్ర శేషు

లింగపాలెం: గౌడ జాతికే కాక బహుజన వర్గాలకే వన్నె తెచ్చిన మొట్ట మొదట బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ అని అఖిల భారత గౌడ సంఘం అధ్యక్షుడు దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. లింగపాలెంలో సోమవారం పాపన్నగౌడ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు శేషు, అశోక్ గౌడ, సీహెచ్ రామలింగేశ్వరావు, జుజ్జురి బాబ్జి, లింగపాలెం మండల అధ్యక్షుడు తాళం సోంబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకలు గజ్జా వెంకటేశ్వరరావు, కె రామారావు, సత్యన్నారాయణ, శివయ్య, పి సుబ్బారావు, పి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బంజారాల తీజ్ పండుగ



నామవరంలో తీజ్ పండుగను నిర్వహిస్తున్న బంజారాలు

చింతలపూడి: బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో నామవరం గ్రామంలో తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. తీజ్ బుట్టలను ఆడపిల్లలు ఎత్తుకొని తీన్మార్ డప్పులతో, సాంస్కృతిక బంజారా నృత్యాలతో ఊరంతా ఊరేగించుకుంటూ గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. నవరాత్రులు తీజ్ దీక్ష చేసిన ఆడబిడ్డలకు బంజారా భజరంగీ బేరి కమిటీ నాయకులు నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారాలు జరుపుకునే తీజ్ పండుగ శాస్త్రీయమైన సాంప్రదాయ వ్యవసాయ పండుగ అని అన్నారు. వెదురు బుట్టల్లో నవధాన్యాలు ఆడ బిడ్డలతో వేయించి, వాటిలో ఏ విత్తనం మొలకలు బాగా వస్తాయో ఆ పంటలు వేసుకునే ప్రయోగాత్మక వ్యవసాయ పండుగ అని అన్నారు. సంఘ అధ్యక్షుడు భూక్యా శ్రీనివాస్ నాయక్ , సంఘ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ చంద్ నాయక్, భూక్యా వేణుగోపాల్, ధరావత్ రవి, మూడు సోని, పుష్ప, లక్ష్మి పాల్గొన్నారు.

బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు

- వ్యాపార కేంద్రాలకు నిలయంగా ధర్మాజీగూడెం బస్టాండ్
- బస్ షెల్టర్‌లోకి రాని బస్సులు
- సదుపాయాలు లేక ప్రయాణికుల అవస్థలు



ధర్మాజీగూడెం రోడ్డుపై వానలో బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

లింగపాలెం: ధర్మాజీగూడెం నుంచే ప్రయాణించే ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు పడుతూ నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న బస్టాండ్ వ్యాపార సంస్థలకు నిలయంగా మారింది. దీనికితోడు బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి చూడాల్సి వస్తోంది. ప్రతి నిత్యం ఈబస్టాండ్‌కు సుమారు 4 డిపోలకు చెందిన సుమారు 25 నుంచి 30 బస్సులు వరకు వచ్చి వెళుతుంటాయి. వేలాది మంది ఇక్కడ నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. కానీ బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో రోడ్డుపైనే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వేచి చూడాల్సి వస్తోందని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇక్కడ దూరప్రాంతం నుంచి వచ్చే ప్రయాణికులకు సైతం మురుగుదొడ్లు సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చునేందుకు కూడా అనువుగా లేదు. గతంలో ఇక్కడ కంట్రోలర్ ఉన్నప్పుడు బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేవి. ప్రస్తుతం ఆయన్ను కూడా తీసివేయడంతో బస్టాండ్ ఆటోల ఆక్రమణలకు గురైంది. ధర్మాజీగూడెంలో కొన్నేళ్ల క్రితం సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన బస్టాండ్ ప్రారంభోత్సవానికి నోచుకోక నిరుపయోగంగా పడి ఉంది. దీన్ని గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌లో సదుపాయాలు కల్పించడంతోపాటు బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి



బస్సులు బస్‌స్టాండ్‌లోకి రాకుండా రోడ్డుపై ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఒక కంట్రోలర్‌ను ఏర్పాటుచేయాలి. అంతేకాకుండా బస్టాండ్‌లో సౌకర్యాలు, మురుగుదొడ్లు సదుపాయాన్ని కల్పించాలి.

– నూతులపాటి శ్రీనివాసరావు, ధర్మాజీగూడెం

నాచుగుంటకు శ్రీవారి ధర్మప్రచార రథం



ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం నుంచి స్వామివారి ధర్మప్రచార రథం సోమవారం ఉంగుటూరు మండలం నాచుగుంటకు తరలివెళ్లింది. ముందుగా కొండపైన జంటగోపురాల వద్ద ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు కొబ్బరికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. నాచుగుంట గ్రామంలో డాక్టర్ సుంకవల్లి గో వ్యవసాయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణ వేడుకను సోమవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్టు హయగ్రీవాచార్యులు తెలిపారు. అందులో భాగంగానే రథం నాచుగుంటకు వెళ్లిందని చెప్పారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



చింతలపూడి: జ్ఞానారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జంగారెడ్డిగూడెం: టెక్కినవారిగూడెంలో మళ్లీడి బాబిని సత్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు గృహం వద్ద సోమవారం జ్ఞానారెడ్డిని కార్యకర్తలు, నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మోసం చేసి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేస్తున్న అరాచక పాలనకు స్వస్తి పలికే రోజు త్వరలోనే వస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం, వేధింపులకు గురిచేయడం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు, కే చంటి ప్రియా, ఎం .గురుబ్రహ్మం, ఎస్.కాంతారావు, ఏ సుబ్బారావు, ఎం. ఇమ్మానియేల్, గొట్టాపు బాబు, డోకల రాము, కె.ఏలియా, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, మాధవ రెడ్డి, గంగాధర్‌రావు, దారా పేర్రాజు, జి.రాజేష్ నాయుడు, అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీడి బాబికి సత్కారం

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి మళ్లీడి బాబిని టెక్కినవారిగూడెంలోని ఆయన గృహంలో సోమవారం లక్కవరం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను తూ.చ. తప్పకుండా పాటిస్తానన్నారు. అలాగే పార్టీ అభివృద్ధికి అవిశ్రాంతంగా కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పత్తి వీరాస్వామి, మునకాల లక్ష్మణరెడ్డి, కంభపు అప్పలరెడ్డి, దల్లి మోహన్ రెడ్డి, కంభపు రవిరెడ్డి, బూసి దుర్గాప్రసాద్‌రెడ్డి, దల్లి సాయిరెడ్డి, దల్లి స్వరూప రెడ్డి, దల్లి బన్ని రెడ్డి, కంభపు రాజు, మునకాల గణేష్ రెడ్డి, పుసుపుఏలని పుల్లారావు, టెక్కినవారిగూడెం ఉప సర్పంచ్ గాది రాము, వార్డు సభ్యుడు ముమ్మడి దుర్గారావు, ఎంపీటీసీ తానిగడప రామకృష్ణ, బస్వా శ్రీమన్నారాయణ, చిక్కాల సాయికుమార్ తదితరులు ఉన్నారు.

ఈవెంట్ యూనియన్ల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొయ్యలగూడెం: ఈవెంట్ యూనియన్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని, యూనియన్‌లలోని సభ్యులకు సామాగ్రిని ఉచితంగా అందజేయాలని ఈవెంట్ (సౌండ్ సిస్టం, టిప్ టాప్ డెకరేషన్, లైటింగ్) మండల యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం ఏఎంసీ కార్యాలయం వేదిక మొదటి సమావేశం నిర్వహించారు. . ఉత్సవాల సమయంలో డీజే సౌండ్ సిస్టంలపై ఆంక్షలు విధిస్తున్నారని దీని వల్ల నష్టపోతున్నామన్నారు. వినాయక నవరాత్రులు, దసరా సమయాల్లో మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వ శాఖలను కోరారు. పోలవరం, కొవ్వూరు నియోజకవర్గాల యూనియన్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎస్సై వి.చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మట్టా వనజా లక్ష్మి, కొండ వెంకటరమణ (ప్రెసిడెంట్), రాంబ్రహ్మం (సెక్రటరీ), తోట రమణ (కోశాధికారి), యు.విజయ్, వి.సుబ్బారావు, కె.సుబ్బారావు, వాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల రక్షణకు చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వృద్ధుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్డీవో ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుకునూరి రామచంద్ర రావు మాట్లాడుతూ 2007 , 2011 చట్టాలు గురించి వివరించారు. వృద్ధులు గౌరవంగా, భద్రతతో జీవించేలా, వారి ప్రాణ, ఆస్తి రక్షణ కోసం తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ఈనెల 16న జాతీయ వృద్ధుల కొర్కెల దినోత్సవం సందర్భంగా వినతిపత్రం అందించాల్సి ఉండగా, సెలవుదినం కావడంతో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.త్రినాథరావు, కోశాధికారి ఆర్. రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

హెల్త్ కేర్, మెడిసిన్‌లోనూ నానో టెక్నాలజీ



సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: హెల్త్‌కేర్, మెడిసిన్‌లో నానో టెక్నాలజీ పాత్రపై జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం అతిథి ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సౌత్ కొరియా చుంగ్‌యాంగ్ యూనివర్సిటీ బ్రెయిన్‌పూల్ ప్రొఫెసర్ డా.గంగరాజు గెడ్డ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి రంగంలో నానో టెక్నాలజీ దూసుకుపోతోందన్నారు. హెల్త్‌కేర్, మెడిసిన్‌రంగంలో కూడా నానో టెక్నాలజీని వినియోగిస్తున్నారని, ముఖ్యంగా కేన్సర్ వంటి ప్రాణాంత వ్యాధులపై నానో టెక్నాలజీని ఉపయోగించి నివారణకు మార్గాలు కనిపెడుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో, నానో టెక్నాలజీ అనే అంశం గురించి విద్యార్థులందరూ తెలుసుకోవాలన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు టీవీ రాంబాబు, కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి జె.రాజా శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ బి శ్రీనివాసరావు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కవరంలో తాగునీటి సమస్యతో అవస్థలు



లక్కవరం మసీదు సమీపంలో ట్యాంకర్ ద్వారా తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: తాగునీటి కోసం లక్కవరం గ్రామంలోని రెండవ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 15వ తేదీన మంచినీటి ట్యాంకుకు సంబంధించిన మోటార్ స్టార్టర్ కాలిపోయింది. దీంతో వెంటనే సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు జోక్యం చేసుకుని కొత్త స్టార్టర్ తెచ్చి మంచినీటి సరఫరా పునరుద్ధరించారు. అయితే ఆ తరువాత మోటార్ కాలిపోయి రెండవ వార్డులోని సుమారు 7 వీధులకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గత మూడు రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది కాలంగా మంచినీటి సమస్య తలెత్తుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ప్రజా ప్రతినిధుల జోక్యంతో ఒక మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. అది కూడా మసీదు సెంటర్ వద్ద పెట్టి చుట్టుపక్కల వీధుల్లోని ప్రజలను అక్కడికి వచ్చి నీరు పట్టుకోవాలని చెప్పడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతదూరం నీళ్లు మోయలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం



ధర్మాజీగూడెంలో గోతులు పడిన ప్రధాన రహదారి

లింగపాలెం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు లింగపాలెం మండలంలోని ఏలూరు– చింతలపూడి వెళ్లే ప్రధాన రహదారి పలు చోట్ల గోతులు పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ధర్మాజీగూడెంలో ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ద్విచక్రవాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గోతులను పూడ్చించి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



కుక్కునూరు సంజయ్‌నగర్ కాలనీలో నిలిచిన వర్షం నీరు



కొండిన్యముక్తి గ్రామంలో నీటమునిగిన పత్తి పంట

కుక్కునూరు: అల్పపీడన ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీల్లో ఇళ్ల లోకి వరద నీరు చేరుకుంది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో వరద నీటితో రోడ్లు చెరువులను తలపించాయి. భారీ వర్షం కారణంగా మధ్యాహ్నం నుంచే పలు పాఠశాలల నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపించివేశారు. కాగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు కాలనీల్లోని అంతర్గత రహదారులు బురదమయంగా తయారయ్యాయి. ఏకధాటిగా కురిసిన వర్షంతో పత్తి చేలలో నీరునిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నూతనంగా రెండు బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయంలో బార్ల నోటిఫికేషన్‌పై మద్యం వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2025–2028వ సంవత్సరానికి (మూడేళ్లకు) జారీ చేసిన నోటిఫికేషన్‌లో జంగారెడ్డిగూడెం పట్టణానికి రెండు బార్లను మంజూరు చేసిందన్నారు. వీటికోసం దరఖాస్తుదారులు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు కింద రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.10 వేలను చలానా రూపంలో ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లోగాని చెల్లించాలన్నారు. ఒక్కొక్క బారుకు లైసెన్స్ ఫీజు కింద 2025–2026 సంవత్సరానికి రూ.35 లక్షలు, 2026–2027 సంవత్సరం రూ.38.50 లక్షలు, 2027–2028 సంవత్సరానికి రూ.42.35 లక్షలు ప్రభుత్వం లైసెన్స్ ఫీజుగా నిర్ణయించిందన్నారు. దరఖాస్తులను ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయములో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలన్నారు. ఈనెల 28వ తేదీన కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో డ్రా తీయబడుతుందన్నారు. వివరాలకు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ కార్యాలయం 96185 21855, 99634 63363 నంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జాతీయ అంధత్వ నివారణా కార్యక్రమంలో భాగంగా వేదాంతపురం ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వ కంటి వైద్యుడు సీహెచ్ చక్రవర్తి కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 125 మందికి కంటి పరీక్షలు చేయగా ఏడుగురికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి, కళ్లజోళ్లకు ఏలూరు అంధత్వ నివారణ సంస్థ వారికి తెలియపరిచారు. కార్యక్రమంలో బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు బీవీ నారాయణ, సూపర్‌వైజర్ బాషా, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ వినోద్ కుమార్, ఏఎన్ఎంలు ఎం.మాణికుమారి, కె.గంగాదేవి, హెల్త్ అసిస్టెంట్ మోహన్, ఆశా కార్యకర్తలు పి.నాగమణి, కె.సునీత పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం: అధిక వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.స్లీవజోజి ఆదేశించారు. మండలంలో ఉన్న కాలువలు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తల్లిదండ్రులు పిల్లలను గమనించుకోవాల్సినదిగా వారికి ముందస్తుగా సూచనలు ఇవ్వాలన్నారు. ఏవిధమైనా అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించాలన్నారు. సంబంధిత ప్రదేశాల వద్ద గ్రామ సహాయకులను పర్యవేక్షణలో ఉంచాలని, ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని, పశు నష్టం, ఇండ్ల నష్టం జరిగితే వెంటనే గ్రామ రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కుక్కునూరు: ఈనెల 23న ఒంగోలులో జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభల్లో గిరిజన సాంప్రదాయం, సంస్కృతి తెలియపరిచేలా గిరిజన యువతకు రేలానృత్యంపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్, మైసాక్షి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో రాధామనోహర్ దాస్



శ్రీవారి ఆలయంలో వేద పండితులతో రాధామనోహర్ దాస్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త రాధామనోహర్ దాస్ సోమవారం రాత్రి సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా పండితులు క్షేత్ర చరిత్రను వివరించిన తీరుపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే ఆలయంలో అర్చకుల పూజా విధానం , భక్తుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకుంటున్న తీరు బాగుందని ఆయన ప్రశంసించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న యువతి ఈనెల 17వ తేదీ ఉదయం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.